## మున్నుడి

శ్రీ మహావిష్ణువు సేనాధిపతియైన విష్వక్సేనుడిపై అద్భుతమైన కీర్తన చెబుతున్నారు అన్నమాచార్యులవారు. ఇదిగో అచ్యుతుని సేనాపతి వస్తున్నాడు. ఓ అసురులారా! పారరో (పారిపోండర్రా) పది దిక్కులకు - అని హెచ్చరిస్తున్నారు. శ్రీవేంకటేశ్వరుని బ్రహ్మోత్సవాల సమయంలో అన్నమయ్య చెప్పిన అజరామరమైన కీర్తన ఇది. ఆనాటి తిరుమలేశుని వైభవాన్ని కళ్లకు కట్టుతున్నది. అవునా?

**కం॥ కనుడీ హరి సేనాపతి**
**మన విష్వక్సేనుడంట మాధవు వెంటన్**
**గునగున పారరొ అసురులు**
**ఘనుడౌ అన్నయ్యపాడె కదు వేడుకతో.**

**రాగం : మోహన**

అదెవచ్చె నిదెవచ్చె నచ్చుతు సేనాపతి
పది దిక్కులకు నిట్టె పారరో యసురులు ॥అదె॥

గరుడధ్వజం బదె ఘన శంఖరవమదె
సరుసనే విష్ణుదేవు చక్రమదె
మురవైరి పంపులవె ముందరి సేనలవె
పరచి గగ్గోల కాడై పారరో దానవులు ॥అదె॥

తెల్లని గొడుగులవె దేవదుందుభులు నవె
యెల్ల దేవతల రథా లింతటా నవె
కెల్లు రేగీ నిక్కి హరి కీర్తి భుజములవె
పల్లపు పాతాళాన బడరో దనుజులు ॥అదె॥



Scanned with CamScanner

వెండిపైడి గుదెలవె వెంజామరములవె
మెండగు కైవారాలు మించినవవె
దండి శ్రీవేంకటపతి దాడి ముట్టినదె యిదె
బండు బండై జజ్జరించిపారరోదైతేయులు ॥అదె॥

**భావామృతం :**

ఓ రాక్షసులారా! అదిగో వచ్చేస్తున్నాడు. ఇదిగో వచ్చేస్తున్నాడు. అచ్యుతుని సేనాధిపతియైన విష్వక్సేనుడు, అతడే. పది దిక్కులలో యెక్కడికి పారిపోతారో, ఇట్టే పారిపోండ్రా.

అదిగో చూశారా శ్రీహరి యొక్క గరుడధ్వజము. మీకు ఘనమైన పాంచజన్యమను శంఖము చేసే శంఖారావం వినబడుచున్నదా? అదిగో సరుసనే (ఆ ప్రక్కనే) విష్ణు దేవుని సుదర్శన చక్రము ఎలా మిఱుమిట్లు గొల్పుచున్నదో చూడండి. మురవైరి అయిన శ్రీకాంతుని పంపులు (పురమాయింపులు) అవిగో. రక్షణగా ముందున నడచి వస్తున్న దేవతల సేన అదిగో. ఓ దానవులారా! మీరంతా గగ్గోలు పెట్టి పారిపోండి. మీ ప్రాణాలు కాపాడుకోండి.

అదిగో ఆ కనబడుతున్న తెల్లని గొడుగులు నారాయణుని రాకను సూచిస్తున్నాయి. ధమధమా మ్రోగుతున్న దేవదుందుభుల భేరీ వినబడుచున్నది కదా! బారులు తీరి దేవతా ప్రముఖుల రథాలు ఒకదాని వెనుక ఒకటి వస్తున్నాయి. అందుచేత కెల్లురేగి (దారినిండా దుమ్ములేచి నానాగందరగోళంగా ఉన్నది). శ్రీహరి ఆగమనాన్ని సూచిస్తూ ఆయన భుజకీర్తులు ప్రస్ఫుటంగా నిక్కి (అతిశయముగా) కనిపిస్తున్నాయి. ఓ దనుజుల్లారా! మీ స్థావరమైన పల్లపు లోతైన పాతాళమునకు పారిపోండి. మీ పిక్కబలం చూపించండి.

అదిగో బంగారు, వెండి 'గుదెలు'. ('గుదె' అంటే నాలుగు మూరలు పొడవున్న దండము. నేటి కాలంలో వీటిని లాఠీలు అంటున్నాం. కానీ లాఠీ పొడుగు ఆనాటి గుదె పొడుగులో సగమే ఉంటుంది). అవిగో వింజామరలు. అదిగో అసంఖ్యాకమైన "కైవారాలు" (వంది మాగదులు... వీళ్లు విజయీభవ అని ఉత్సాహపరుస్తుంటారు). అదిగో శ్రీవేంకటేశ్వరుని 'దండి దాడిముట్టి' (దండెత్తి ముట్టడించు సైన్యము). ఇక బండుబండై (ఆకతాయితనం అరిగిపోయి) ఓ దైత్యులారా! జజ్జరించి పారరో... (కకావికలై పారిపోండి).



Scanned with CamScanner